క్లుప్తంగా

ఎగువ మానేరుకు వారబందీ

గంభీరావుపేట: నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు నీటి విడుదలకు వారబందీ నిర్ణయించినట్లు ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈ నర్సింగ్ తెలిపారు. ప్రతి శనివారం ఉదయం ఆరు గంటలకు నీటి సరఫరా నిలిపేస్తామని, తిరిగి సోమవారం ఉదయం నీటి విడుదల కొనసాగుతుందన్నారు.

నీలకంఠంకు జాతీయ అవార్డు

గంభీరావుపేట: నర్మాల గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి గుండెల్లి నీలకంఠంకు విజయవాడకు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారు జాతీయస్థాయి నంది అవార్డును ప్రకటించారు. వచ్చే నెల 2న విజయవాడలో అవార్డు అందుకోనున్నారు. తెలుగు సాహిత్యంలో నీలకంఠం చేసిన విశిష్ట సేవలను గుర్తించి అవార్డు ప్రకటించారు. ఎవుసం, యాసంగి, మాఊరు–మానేరు కవితా సంపుటాలకు మంచి గుర్తింపు లభించింది. ఎంఈవో గంగారాం, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రశేఖర్, తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు వాసరవేని పర్శరాములు, కవి పెద్దింటి అశోక్‌కుమార్ అభినందించారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

బోయినపల్లి: సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలకు కార్మికులు, మేధావులు తరలిరావాలని మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ కోరారు. కొదురుపాక గ్రామంలో శుక్రవారం కార్మికులతో మాట్లాడారు. అనుముల రవి, ఆవుల మల్లయ్య, ఆవుల రాములు, వెంకటరెడ్డి, కడుదుల రవి తదితరులున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఇల్లంతకుంట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ క్రీడల్లో మండలస్థాయిలో విజేతలకు కలెక్టర్‌తో కలిసి బహుమతులు అందజేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, తహసీల్దార్ ఎంఏ ఫరూక్, ఎంపీడీవో శశికళ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

27న జాతర దుకాణాల కేటాయింపు

కోనరావుపేట: మామిడిపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 29న మాఘమాస్య జాతర సందర్భంగా 27న దుకాణాల కేటాయింపు జరుగుతుందని ఆలయ ఇన్‌చార్జి నరేందర్, కార్యదర్శి సతీశ్ తెలిపారు.

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

చందుర్తి: ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం నెరవేర్చాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు చిలుక పెంటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మార్కండేయ దేవాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. సంటి బాపురావు, వరికెల్ల బాపురావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ఇల్లంతకుంట: నిరుపేద కుటుంబాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. సోమరంపేట, పొత్తూరు, తిప్పాపురం, ఇల్లంతకుంట, రేపాక, తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. ఇల్లంతకుంట పట్టణ అధ్యక్షుడు మామిడి నరేశ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ జమాల్, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కాసుపాక రమేశ్, మామిడి రాజు, గొడుగు నరసయ్య, బాలపోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీ

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యకర్తలు డప్పులు కొడుతూ శుక్రవారం ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలో జరిగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సమావేశానికి తరలివెళ్లారు. మంద రాజు, తడకపల్లి భూమయ్య, బడుగు లింగం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తంగళ్లపల్లి: మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు సజ్జనం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు ఎం.శ్రీకాంత్, పి.వాసుదేవరావు, టి.మల్లికార్జున్, పి.రాంచందర్‌రావు, ఎస్.విమల, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తోందని ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. అక్కపల్లిలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, నేవూరి రవీందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, జంకె లచ్చిరెడ్డి, రవి నాయక్, తండావాసులు పాల్గొన్నారు.



కష్టాన్ని గుర్తించి.. కార్మికులకు వడ్డించి..

వేములవాడ: తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఐదేళ్లపాటు పారిశుధ్యం నిర్వహణలో అష్టకష్టాలకోర్చుకుని తమ పాలకవర్గానికి మంచి పేరు తెచ్చి కేంద్ర ప్రభుత్వంతో ప్రశంసలు అందుకునేలా చేసిన మీ అందరి కష్టం మరవలేనిదని మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి అన్నారు. ఈనెల 26తో పదవీ కాలం ముగుస్తుండడంతో శుక్రవారం మహిళా కార్మికులకు స్వయంగా భోజనాలు వడ్డించారు.

శివాలయంలో పూజలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభానికి మేకనాలు అమర్చే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గోదాగోష్ఠి సభ్యులు తరలివచ్చి పూజలు చేశారు.





పొగమంచు పోనంటోంది..

వేములవాడ: వేములవాడ ప్రాంతంలో శుక్రవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటలు దాటినా.. సూర్యుడి వెలుతురు కనిపించినా.. పొగమంచు అలాగే కొనసాగింది. దీంతో జనం గజగజ వణికిపోయారు. చాలామంది మంట కాగుతూ చలి నుంచి ఉపశమనం పొందారు.

పథకాల అమలుకు దశలవారీగా వార్డు సభలు



సిరిసిల్లటౌన్: మాట్లాడుతున్న జిందం కళ



వేములవాడ: మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు



కోనరావుపేట: మామిడిపల్లిలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం అందించాల్సిన సంక్షేమ పథకాల అమలుకు దశలవారీగా అన్ని వార్డుల్లో వార్డు సభలు నిర్వహిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. తన సొంత వార్డు 3లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో మాట్లాడారు. తహసీల్దార్ ఉమారాణి, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, మెప్మా అధికారి మహాలక్ష్మి, వార్డు ఆఫీసర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 28 వార్డులకు చెందిన ప్రజలు పెద్దఎత్తున మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకొని దరఖాస్తు చేసుకున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన దరఖాస్తులు అందజేశారు. అయితే వార్డు సభల్లో ఇచ్చిన దరఖాస్తులను తిరిగి కార్యాలయంలోనూ సమర్పిస్తున్నారని మున్సిపల్ సిబ్బంది మొత్తుకుంటున్నారు.

కోనరావుపేట: గొల్లపల్లి(కొలనూర్), మామిడిపల్లి, పల్లిమక్త, ఎగ్లాస్‌పూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఆహార భద్రత కార్డుల అర్హులను ఎంపిక చేశామన్నారు. తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: అర్హులు కాని వారు పథకాలు పొందితే వాటిని రద్దు చేసుకోవాలని, అటువంటివారికి రూ.1,016 బహుమానం ఇస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. పత్తికుంటపల్లె గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. తహసీల్దార్ ఎంఏ ఫరూక్, ఎంపీడీవో శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్, గుడిసె ఐలయ్యయాదవ్, బి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రజాపాలనతో పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. గూడెం గ్రామసభలో శుక్రవారం మాట్లాడారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, ప్రత్యేకాధికారి లత, ఏవో అనూష, ఎల్లాగౌడ్, బొప్ప శ్రీధర్, గిరి, శ్రీనివాస్‌రావు, విష్ణు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేటలో గ్రామసభ గరంగరంగా సాగింది. అధికారులు పథకాల లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. అర్హుల పేర్లు రాలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం, ఎంపీడీవో రాజేందర్, ఈవో లక్ష్మణ్ పాల్గొన్నారు. ముస్తఫానగర్ గ్రామసభలో తహసీల్దార్ భూపతి పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని 23 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి 2,867 దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయని ఎంపీడీవో భీమ జయశీల శుక్రవారం సాయంత్రం తెలిపారు.

ఇల్లంతకుంట: గ్రామసభల్లో కాంగ్రెస్ నాయకులు పథకాల పేర్లను చదివి వినిపిస్తూ కార్యక్రమాలు నడిపిస్తున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు బుర్ర సూర్యగౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బుర్ర బాలకృష్ణ, గోజగాని కిషన్‌రావు, రాములు యాదవ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత పాటిద్దాం



సిరిసిల్ల పాత బస్టాండులో విద్యార్థుల మానవహారం

సిరిసిల్లటౌన్: రోడ్డు భద్రత నిబంధనలు పాటిద్దాం .. సురక్షితంగా ప్రయాణిద్దామంటూ సిరిసిల్లలో విద్యార్థులు నినాదాలు చేశారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ట్రాఫిక్ ఎస్సై రమేశ్, ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఆర్టీసీ అధికారులు నక్క శ్రీనివాస్, వేణు, నర్సయ్య, భీముడు, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి శుక్రవారం ఇల్లంతకుంట పోలీసులు పూలిచ్చారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ దేవేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ కుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేములవాడరూరల్: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి ఫాజుల్‌నగర్ గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఎస్సై గణేశ్ హెల్మెట్ ధరించిన వాహన చోదకులకు గులాబీలిచ్చి అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట: స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఆర్ఎంపీలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శిక్షణ కార్యక్రమాలు చేపట్టినా.. దురదృష్టవశాత్తు ఆయన మృతితో నిలిచిపోయాయని అన్నారు. మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, వైస్ చైర్మన్లు మహేశ్, భూంరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, నాయకుడు గోపు పర్శయ్య, మహిళా నాయకురాళ్లు సంధ్య, వినోద, అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



విప్ సమక్షంలో చేరుతున్న నాయకులు

వేములవాడరూరల్: నూకలమర్రి, హన్మాజీపేట గ్రామాల నుంచి నాయకులు కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో చేరారు. నూకలమర్రి, హన్మాజీపేట గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ వైస్ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, సింగిల్‌విండో డైరెక్టర్లు సుమారు 200 మంది బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులు చేరారు.

మీ సేవలు ప్రజలు గుర్తుంచుకోవాలి

వేములవాడ: ప్రజాసేవలో నిరంతరం నిమగ్నమై ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. కమిషనర్ అన్వేష్, వైస్ చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొని తమతమ సందేశాలిచ్చారు.

బాల్యాన్ని గుర్తు చేసిన ఆటల పోటీలు

సిరిసిల్లకల్చరల్: సీనియర్ సిటిజన్లకు నిర్వహించిన ఆటల పోటీలు బాల్యాన్ని గుర్తుకు తెచ్చాయని పలువురు అన్నారు. శుక్రవారం ఆల్ సీనియర్ సిటిజన్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వయోవృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప హాజరై పోటీలను ప్రారంభించారు.

విద్యతోనే అభివృద్ధి

వేములవాడఅర్బన్: పట్టణంలోని న్యూఅర్బన్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బాలికలకు సరైన విద్య అందిస్తే మహిళల పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉపాధ్యాయులు విజయ, మంజుల తదితరులున్నారు.

అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. స్త్రీలు విద్య, ఉద్యోగం కాకుండా అన్ని రంగాల్లో ముందుంటున్నారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు శోభారాణి, ప్రసాద్, శ్రీధర్‌రావు, నర్సయ్య తదితరులున్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల కళాశాల, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రెహానా ఇఫ్ఫత్ మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూత్రపిండాల వ్యాధితో ఎంఈవో మృతి



రవీందర్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన ఎంఈవో ఈసరి రవీందర్(54) మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. వివరాలు ఇలా ఉన్నాయి. రవీందర్ ప్రస్తుతం వరంగల్ రూరల్ ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పదోతరగతి వరకు ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న రవీందర్ ఉద్యోగం వరంగల్ జిల్లాలో నిర్వహించారు. మొన్నటి వరకు ఎల్కతుర్తి మండల విద్యాధికారిగా పనిచేసిన రవీందర్ ఇటీవల వరంగల్ రూరల్‌కు బదిలీ అయ్యారు. గత ఆరేళ్లుగా రవీందర్ మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఒక వైపు డయాలసిస్ చేయించుకుంటూనే ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వరంగల్ ఆస్పత్రిలోనే మరణించాడు. మృతదేహాన్ని స్వగ్రామం ఎల్లారెడ్డిపేటకు తీసుకొస్తున్నారు. 1986–87 పదోతరగతి సహచర బాల్యమిత్రులు రవీందర్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. రవీందర్ మృతి విద్యారంగానికి తీరని లోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, స్థానిక ఎంఈవో కృష్ణహరిలు పేర్కొన్నారు. మృతునికి భార్య లత, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్‌లోని సర్దార్ పాపన్న విగ్రహం వద్ద ఇసుక ట్రాక్టర్ ఓ ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం ఢీకొట్టింది. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన నర్సయ్య, సురేశ్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను గ్రామస్తులు వెంటనే 108 వాహనంలో సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ తప్పించుకోగా.. ట్రాక్టర్ స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన మూడవత్ హీక్యానాయక్(55) అనే వ్యక్తి ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని అశోక్ లేలాండ్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హీక్యానాయక్ కాలు విరిగి తలకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని వేములవాడ–సిరిసిల్ల ప్రధాన రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సిరిసిల్ల పట్టణానికి చెందిన విజయ్, స్రవంతికి తీవ్ర గాయాలు కాగా.. 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నలుగురి రిమాండ్

గంభీరావుపేట: శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ముస్తఫానగర్‌కు చెందిన మహేశ్, మల్యాల సురేందర్ గంభీరావుపేట నుంచి ముస్తఫానగర్ వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న మహ్మద్ హమీద్ హుస్సేన్, మహ్మద్ అమాన్‌ఖాన్‌ల ద్విచక్ర వాహనాలు రెండు ఢీకొన్నాయి. మాటమాట పెరిగి వివాదానికి దారితీసింది. మతానికి, వర్గాలకు సంబంధించి మనోభావాలను కించపరిచేలా ప్రవర్తించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

వేర్వేరు కేసుల్లో జైలు

సిరిసిల్లకల్చరల్: రెండు వేర్వేరు దొంగతనం కేసుల్లో ఇద్దరు నిందితులకు ఆరు నెలలపాటు జైలుశిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన ఎం.భాస్కర్ అనే వ్యక్తి బైక్‌పై బీవైనగర్‌కు వెళ్తుండగా సంజీవయ్యనగర్‌కు చెందిన యాలకుల అశోక్ అనే వ్యక్తి భాస్కర్ ప్రయాణిస్తున్న వాహనానికి ఢీకొన్నాడు. ఫలితంగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అశోక్ తాను పోలీసునని.. తన బైక్‌కే ఢీ కొడతావా అంటూ రూ.3వేలు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన దగ్గర డబ్బుల్లేవని భాస్కర్ చెప్పినా వినకుండా అతడి జేబులోంచి ఏటీఎం కార్డు తీసుకొని మూడు వేలు డ్రా చేసుకున్నాడు. అనంతరం అశోక్ పోలీస్ కాదని, వ్యాన్ డ్రైవర్ అని తెలుసుకున్న భాస్కర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ అధికారి ఎస్ఐ బి.శ్రీనివాస్ చార్జ్‌షీట్ దాఖలు చేశాడు.

2020 జనవరి 16న గుర్తుతెలియని వ్యక్తి ఒకరు కోర్టు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం దింది. కోర్టు డ్యూటీ రమేశ్‌కు అనుమానం వచ్చి పట్టుకున్నాడు. విచారణలో తాను దొంగతనానికి వచ్చినట్లు యాలకుల అశోక్ అంగీకరించాడు. ఈ మేరకు ఠాణాలో ఫిర్యాదు నమోదైంది. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ చెలుముల సందీప్ కేసు వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఒక్కో కేసులో ఆరు నెలల చొప్పున కారాగార శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్యారమ్ ఆడుతున్న లక్ష్మణాచారి, ప్రశాంత్‌కుమార్, సదానందం



క్యారమ్స్ పోటీల్లో మహిళా న్యాయవాదులు

వేములవాడ: క్రీడలు మానసిక ప్రశాంతతనిస్తాయని వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా శుక్రవారం అడ్వకేట్లతో కలసి క్యారమ్ ఆడారు. ఏజీపీలు బొడ్డు ప్రశాంత్‌కుమార్, భానుప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, అడ్వకేట్లు నరేశ్, మహేశ్, నయీమా, నాసరి, అన్నపూర్ణ, సుజాత, శంకర్, నవీన్, అంజయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. క్యారమ్స్ పోటీల్లో మహిళా న్యాయవాదులు చురుగ్గా పాల్గొన్నారు.

నిరుపేదల బియ్యం పక్కదారి

వేములవాడరూరల్: నిరుపేదలకు ప్రభుత్వమిచ్చే పీడీఎస్ బియ్యాన్ని ఆ గ్రామానికి పంపిణీ చేయకుండానే వచ్చిన మొత్తం బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు తెలిసింది. ఈ విషయం గుట్టుచప్పుడు కాకుండా నిరుపేదల నుంచి వేలిముద్రలు తీసుకుంటేనే బియ్యం వస్తాయని నమ్మబలికిన సదరు డీలర్లు సంతకాలు తీసుకొని ఈనెల 8న దాదాపు 45 క్వింటాళ్ల బియ్యాన్ని సివిల్ సప్లయి నుంచి తీసుకున్నారు. ఆ బియ్యాన్ని గ్రామంలో పంపిణీ చేయలేదు. ఈనెల 23న ఆ గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో కొందరు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు బియ్యం తీసుకొని పంపిణీ చేయకుండానే పక్కదారి పట్టినట్లు గుర్తించారు. వెంటనే దీనిపై విచారణ జరిపి పైఅధికారులకు నివేదిక పంపినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత వివరాల ప్రకారం.. నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన ఇన్‌చార్జి డీలర్ ఈనెల 8న 40.44 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 5.60 కిలోల ఏపీడీఎస్ బియ్యాన్ని డీలర్ సివిల్ సప్లయి నుంచి తీసుకొని గ్రామంలో సప్లయి చేయలేదు. ఈ విషయంపై ఆ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన తహసీల్దార్ సుజాత బియ్యం పక్కదారి పట్టినట్లు నిర్ధారించి పైఅధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు. నూకలమర్రి గ్రామానికి చెందిన డీలర్ నమిలిగుండుపల్లి గ్రామానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

సూత్రదారులెవరు..?

పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని గ్రామంలో ఒక్కరికి కూడా పంపిణీ చేయకుండా వచ్చిన మొత్తం బియ్యాన్ని పక్కదారి పట్టించిన పాత్రలో సూత్రదారులు ఎవరనేదానిపై అధికారులు దృష్టి పెట్టారు. ఈ విషయంపై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా.. బియ్యం తీసుకొని పంపిణీ చేయలేదని, దీనిపై ఉన్నతాధిరులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ముస్తాబాద్: బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోప) ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

గంభీరావుపేట: దమ్మన్నపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేషనల్ బుక్ ట్రస్ట్ వారు అందించిన వివిధ పుస్తకాలను పంపిణీ చేశారు.

కరాటేలో ప్రతిభ

వేములవాడ: వేములవాడ ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి బ్రౌన్ బెల్టులు సాధించినట్లు కరాటే కోచ్ అబ్దుల్ మన్నాన్ శుక్రవారం తెలిపారు. కరీంనగర్‌లో ఈనెల 23న జరిగిన బ్రౌన్ బెల్టుల గ్రేడింగ్ టెస్ట్‌లో కటాస్, కుమితే అంశాల్లో ప్రతిభ కనబరిచి బ్రౌన్ బెల్ట్ సాధించిన కె.సాయిమణిహర్షిత్, కె.సాయిమణిరూప్, యు.పవన్‌రాజ్, సీహెచ్ సూర్యసుశీల్, జి.వివేశ్రీ, వి.శ్రీహర్సలకు చీఫ్ మాస్టర్ వసంత్‌కుమార్ బెల్టులు ప్రదానం చేశారు. కరాటే కోచ్‌లు ఎం.తిరుపతి, అర్జున్ సింగ్‌ఠాగూర్, రాజశేఖర్, మోసీన్ ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో ఏఈగా ఎంపిక



కోనరావుపేట: టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో నిజామాబాద్ యువకుడు తన ప్రతిభ చాటాడు. కేతిరెడ్డి సుధాకర్‌రెడ్డి–జయ దంపతుల కుమారుడు ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం వెలువడిన ఫలితాల్లో మిషన్ భగీరథ ఏఈగా ఎంపికయ్యాడు.

బీఆర్ఎస్ స్కీములన్నీ స్కాములే..

సిరిసిల్లటౌన్: పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన స్కీములన్నీ వారు దోచుకున్న స్కాములని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సిరిసిల్లలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. 13వ వార్డులో షటిల్ కోర్టును కేకే మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కే పట్టం

ముస్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకే ప్రజలు పట్టం కడతారని పార్లమెంట్ ఎన్నికల కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం

తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీలో గురువారం ప్రజాపాలన గ్రామసభకు హాజరై ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో గుండెపోటుకు గురై మృతిచెందిన జక్కుల మహేశ్(38) కుటుంబానికి ప్రభుత్వం తరఫున పరిహారం అందజేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలతో తహసీల్దార్ జయంత్‌కుమార్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేల చెక్కు అందించారు. కేకే మహేందర్‌రెడ్డి, ప్రవీణ్ జే టోని తదితరులున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్ఎంలు సుజాత, కీర్తి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ 178 హెల్త్ కార్డులు నమోదు చేశారు.